www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక


ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| బుధవారం | 28-05-2025 |

## పోదామా వద్దా...!?
## వద్దు వద్దు.. పోదాం పోదాం..!

### కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్



**వాస్తవం, హైదరాబాద్:**

కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జూన్ 5వ తేదీన పీసీ ఘోష్ కమిషన్ ముందు కేసీఆర్ విచారణకు హాజరు కావాలని నిర్ణ యించినట్లు తెలుస్తుంది. గులాబీ బాస్‌కి కాళేశ్వరం మిషన్ నోటీసులు ఇచ్చినప్పటికీ నుంచి పార్టీలో కమిషన్ ముందు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది.. కానీ, చివరకు వచ్చే నెల 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం తీసుకు న్నారు కేసీఆర్. మరోవైపు, జూన్ 6న ఈ-టెల రాజేందర్, చివరగా జూన్ 9వ తేదీన హరీష్ రావు హాజరవ్వాలని నోటీసుల్లో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు.



# ఆర్కే చేతికి కవిత
# కొప్పరిచిప్ప..!



## బిడ్డె భుజం మీద తుపాకి.. తండ్రికి సూటి...!!

కేసీఆర్ మీద మరింత ప్రతీకారం తీర్చుకునేందుకు ఆర్కేకు మంచి అవకాశం దొరికింది. అది ఆయన కూతురు కవిత రూపంలోనే రావడంతో తన కత్తికి పదును పెట్టాడు. వరుసగా వార్త కథనాలు ఆంధ్రజ్యోతిలో వండి వారుస్తున్నాడు. గతంలో షర్మిల పార్టీ పెట్టే విషయంలో కూడా అంతే అత్యుత్సాహం ప్రదర్శించిన ఆర్కే.. కవిత విషయంలో మరింత దూకుడుగా పోతున్నాడు. గత రెండ్రోజులుగా ఆ పత్రికలో పూర్తి కల్పిత, డ్యామేజీ కథనాలు వస్తున్నాయి. కేసీఆర్ రాయబారం పంపాడు నిజమే. కానీ అక్కడేం మాట్లాడారో ఎవరికీ తెలియదు. కేసీఆర్.. కవితకు ఫోన్ చేసి మాట్లాడాడని రాశాడు. అంత సీన్ అక్కడ లేదు. ఇక ఇవాళ వచ్చిన వార్తైతే .. కాంగ్రెస్‌తో కవిత రాయబారం నడిపిందని. ఆపార్టీలోకి వెళ్లేందుకు రెడీ అవుతోందని. ఇది మరింత భిన్నమైన, అవాస్తవ కల్పిత కథనం. దీన్ని కనీసం ఎవరూ నిజమా..!? అని కూడా శంకించరు. పూర్తిగా అబద్ధమనే కొట్టి పారేస్తారు. మరెందుకు ఆర్కే ఈ కథనాలు రాస్తున్నాడు..? ఒకటే కారణం. కవితను మరింత బద్నాం చేయాలె. తద్వారా కేసీఆర్ మరింత కుంగిపోవాలె. అంతిమంగా పార్టీ భ్రష్టు పట్టుపోవాలె. కేటీఆర్ దూకుడుకు కళ్లెం వేయాలె. ఇవన్నీ ఆర్కే మదిలోని ఆలోచనలు. ఆ ఆలోచనలకు అనుగుణంగా సాగుతున్నాయా కథనాలు.

**(దండుగుల శ్రీనివాస్)**

ఇవి ఆరంభం మాత్రమే. ఇంకా ముందు ముందు ఆ పేపర్లో వచ్చే వార్తలు కాంగ్రెస్‌కు కంటికి ఇంపుగా, కవిత టీమ్‌కు ఒళ్లు జలదరింపుగా, బీఆరెస్ టీమ్‌కు వికారంగా ఉండనున్నాయి. వాస్తవానికి, కవిత కాంగ్రెస్‌ను, రేవంత్‌రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నది. మొన్నటికి మొన్న ఫార్ములా- ఈ కార్ రేసు కేసులో ఏబీసీ నోటీసుపై సత్వరం స్పందించింది. బీజేపీ విషయంలో కూడా అంతే. వడ్డీతో సహా చెల్లిస్తానని జైలు నుంచి విడుదలైన తరువాత శపథం చేసిన ఆమె... వరంగల్ సభలో తండ్రి ఆ పార్టీని ఎందుకు టార్గెట్ చేయలేదనే విషయాన్ని కూడా పొందుపర్చింది. ఇప్పటికిప్పుడు ఆమె ఏ పార్టీలోకి పోయే ఆలోచన లేదు. సేమ్ కేసీఆర్ స్టాండ్ లాగే. కేసీఆర్‌ను కూడా బీజేపీతో జత కడతాడు... కాంగ్రెస్‌లో విలీనం కాబోతున్నాడు.. అనే ఎన్ని కథనాలు వండినా అవన్నీ ఉత్త ఫేక్ ముచ్చట్లు. ఎన్నికల ఫలితాలను బట్టే రాజకీయ వ్యూహాలు, కలవడాలుంటాయి తప్పితే ఇప్పటికప్పుడు ఏ పార్టీకి సపోర్టుగా ఉండి తనను తాను తగ్గించుకోడు కేసీఆర్. అదే బాటలో పయనిస్తోంది కవిత. బీఆరెస్‌లో ఉంటూ తనకంటూ సొంత బలగాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. జాగృతి పేరు మీదే ముందుకు సాగాలని డిసైడ్ అయ్యింది. దీని వల్ల ఎవరికీ ఇమ్మీడియట్ నష్టం లేదు. బీఆరెస్‌ను ఇరుకున పెట్టాలని లేదు కవితకు. అదే సమయంలో తన దారి తనదనే తండ్రికి, అన్నకు సిగ్నల్ ఇచ్చేసింది. సింగరేణి జాగృతి టీమ్ ఏర్పాటు అందులో భాగమే. ఇక రాష్ట్ర కమిటీలు, అనుబంధ కమిటీలు, జిల్లా కమిటీలు బలోపేతం కానున్నాయి. అందరినీ ఆమె మార్చనుంది. దీనికి రాజకీయ రంగు తీసుకురానుంది. పార్టీ ఏర్పాటు పక్కా. కానీ అది ఇప్పుడు కాదు. సమయం వచ్చే వరకు వేచి చూసి అప్పటి వరకు తెలంగాణ జాగృతి పేరు మీద తన పని తాను దూకుడు చేసుకుంటూ పోవడమే ఇప్పుడామె ముందున్న కర్తవ్యం. మొన్నటి కొత్త పలుకులో కూడా ఆర్కే చెత్తగా పలికాడని బీఆరెస్ టీమ్ ఆర్కే పై సోషల్ మీడియాలో దాడి మొదలుపెట్టింది. ఎప్పటికైనా మా బాపు కేసీఆరే సీఎం.. గుర్తుంచుకో, ఖబడ్దార్ కేసీఆర్..! అంటూ చెత్త చెత్తగా తిడుతూ సోషల్ మీడియాలో ఓ లేఖను విడుదల చేశారు. బీఆరెస్ సోషల్ మీడియా దీన్ని వైరల్ చేస్తోంది. బిడ్డె భుజం మీద తుపాకీ పెట్టి కేసీఆర్‌ను పాయింట్ బ్లాక్ రేంజ్‌లో కాల్చిపాడేద్దామని తుపాకీని సిద్ధం చేసుకుని పెట్టుకున్నాడు ఆర్కే. ఒక్కదెబ్బకు రెండు పిట్టలన్నమాట. కవితను డీమోరలైజ్ చేయడం... తద్వారా పార్టీని, కేసీఆర్‌ను జనాల ముందు పలచన చేయడం ఆర్కే లక్ష్యం. ఇప్పుడు ఆర్కే మీడియాలో అదే వంటావార్పు కార్యక్రమం నడుస్తోంది. అందులో మసాలాలు బాగా దట్టించి వండటంతో ఆ ఘాటు, కవిత, కేటీఆర్, కేసీఆర్ అండ్ టీమ్‌లకు ముక్కు పుటాలు అదిరేలా,అజీర్తి చేసేలా ఉంటున్నాయి. ఉండనున్నాయి.



## చేసిన మంచిని చెప్పడంలో
# వెనుకబడ్డాం..!

### బద్నాం చేస్తున్నా బదులివ్వడం లేదు..!!

### కలెక్టర్లకు సీఎం క్లాస్..

- ధాన్య కొనుగోళ్ల విషయంలో ప్రచారంలో వీక్..!
- ప్రతిపక్షాల ఆరోపణలకు ధీటుగా వివరణేది..?
- వివరాలను వెల్లడించండి... ప్రో యాక్టివ్ గా ఉండండి..!
- రైతు అనారోగ్యం తో చనిపోతే ధాన్యం కొనుగోళ్లతో లింకా..?
- మండిపడ్డ సీఎం..
- ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి కలెక్టర్లదే పూర్తి బాధ్యత...
- ఒక్క నిమిషం వేస్ట్ చెయ్యొద్దు..
- కలియ తిరగండి.. కమిటీలు వేయండి...!

**వాస్తవం ప్రతినిధి - హైదరాబాద్:**

కలెక్టర్లకు క్లాస్ తీసుకున్నాడు సీఎం రేవంత్ రెడ్డి. తను ఎంత మొత్తుకున్నా కలెక్టర్ల తీరులో మార్పు రావడం లేదు. ఏసీ గదులకు పరిమితమవుతున్నారని వేదికలనెక్కి తిట్టినా వారిలో ఇంచు మందం మార్పు రాలేదనే విషయాన్ని మరోసారి ఆయన పరోక్షంగా గుర్తు చేశాడు. ముందస్తుగా కురుస్తున్న వర్షాలు రైతాంగాన్ని అతలాకుతలం చేశాయి. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సరిగ్గా లేదని, సమయానికి చేయలేదని, వర్షానికి ధాన్యం తడిచి రైతు నష్టపోయాడని ప్రతిపక్షాలు ప్రభుత్వం మీద దుమ్మెత్తిపోస్తున్న తరుణంలో .. సీఎం ఈ విషయంలో కలెక్టర్లను టార్గెట్ చేశాడు. ఎందుకు సరైన వివరణ ఇవ్వలేపోతున్నారని మండిపడ్డాడు. అనారోగ్యంతో రైతు చనిపోయినా ధాన్యం కొనుగోళ్లకు లింకు పెడుతుంటే చూస్తూ ఎందుకు ఊరుకుంటున్నారు..? వివరణ ఎందుకు ఇవ్వడం లేదు..? 90 శాతం ధాన్యం కొనుగోళ్లు జరిగినా ఆ వివరాలు ఎందుకు విడుదల చేయడం లేదు..? అని కలెక్టర్ల తీరును ఎండగట్టాడు సీఎం. మంచి పనిని చెప్పడంలో వెనుకబడ్డామని ఒప్పుకున్నాడు. ప్రతిపక్షాల దుష్ప్రచారంలో కొట్టుకుపోతున్నాం తప్పితే దాన్ని ధీటుగా ఎదుర్కొని బదులివ్వడంలో విఫలమయ్యామని మండిపడ్డాడు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కలెక్టర్లదే పూర్తి బాధ్యతన్నాడు. ఇసుక నుంచి మొదలుకొని మేస్త్రీలు, కంకర ధరల విషయంలో కూడా చొరవ తీసుకోవాలని ఆదేశించాడు. క్షేత్రస్థాయిలో తిరిగితేనే ఇవన్నీ సాధ్యమవుతాయి. ఇక కదలండని వారిని పురమాయించాడు. ఓ వైపు వర్షాల తీరును ఎదుర్కుంటూనే, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకుంటూనే, విత్తనాలు, ఎరువుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకుంటూనే.. ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి వంద శాతం ఎఫర్ట్ పెట్టాలని టార్గెట్లు విధించాడు.



## జూన్ 2 నుంచి 9 వరకు
# రాజీవ్ యువ వికాసం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**వాస్తవం, హైదరాబాద్:**

రాజీవ్ యువవికా సంపై తెలంగాణ డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. జూన్ 15 తర్వాత రాజీవ్ యువ వికాసం యూనిట్ల గ్రౌండింగ్ ఉం టుందని, అక్టోబర్ 2 నాటికి 5లక్షల మం దికి దశలవారీగా లబ్ధి చేకూరేలా ప్రణాళిక వేసినట్లు తెలిపారు. తొలి విడతలో రూ.లక్షలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి అవకాశల కల్పన కోసం రాజీవ్ యువ వికాసం ద్వారా జూన్ 2న లబ్దిదా రులకు మంజూరు పత్రాలు అందజేయనున్నామని వెల్లడించారు. రూ. లక్ష లోపు యునిట్లకు మొదటి దశలో ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించి నట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సం సందర్భంగా రేవంత్ ప్రభుత్వం ఎంపికైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నట్లు ప్రకటించారు.

నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం తమదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరో వైపు స్వయం ఉపాది అవకాశాలను కల్పిస్తున్నా మన్నారు. మొదటి విడతలో రూ. లక్షలోపు యునిట్లకు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించిందని, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులంతా రాజీవ్ యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. నిరుద్యోగుల పాలిట వరంగా రాజీవ్ యువ వికాసం నిలుస్తోం దని, బడుగు బలహీన వర్గాలు, పేద యవత జీవితాల్లో రాజీవ్ యువ వికాసం వెలుగులు నింపనుందని వ్యాఖ్యానించారు.



# విస్తరిస్తున్న నైరుతి

### నైరుతికి తోడు బంగాళాఖాతంలో ఆవర్తనం

### పలు జిల్లాల్లో జోరు వానలు.. వేములవాడ జలమయం

### హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

**నిర్దేశం, హైదరాబాద్:**

నైరుతి రుతుపవనాలు దక్షిణ తెలంగాణ లోకి విస్తరించాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్త నం ఏర్పడింది. ఈ కారణంగా రేపు, ఎల్లుండి తెలంగా ణలో భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి.

భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధ, గురువారాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రాబోవు రెండు, మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 7 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండా లని అధికారులు సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం కూడా ఉన్నందున పాత భవనాలు, చెట్ల కింద ఉండకూడదని హెచ్చరిస్తున్నారు. పొలాలకు వెళ్లే రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్నాయి.